ప్రజావాణికి స్పందన కరువు

ఒక్క ఫిర్యాదు కూడా అందని వైనం



ప్రజావాణిలో ఫిర్యాదుదారుల కోసం ఎదురు చూస్తున్న అధికారులు

చార్మినార్: జీహెచ్ఎంసీ ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నప్పటికీ ప్రజల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు. దాదాపు రెండున్నర గంటలపాటు అధికారులు ఫిర్యాదుల కోసం ఎదురు చూశారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతోంది. పాతబస్తీ సర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ముచ్చట్లలో మునిగిపోయిన అధికారులు...

ప్రజావాణిలో గతంలో అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారుల పనితీరు బాగా లేకపోవడమో, పట్టించుకోకపోవడమో తెలియదుకానీ ప్రజలు ఫిర్యాదు చేయడానికి ఆసక్తి చూపలేదు. ప్రజలెవరూ అక్కడికి రాకపోవడంతో అధికారులు ముచ్చట్లతో కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో చార్మినార్ జోన్ ఏఎంసీ రాజారావు, యూబీడీ మేనేజర్ రమేష్, ఎలక్ట్రికల్ విభాగం డీఈ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం నియోజకవర్గంలోని తలాబ్ చంచలం డివిజన్ పరిధిలోని తలాబ్‌కట్టా, భవానీనగర్, చాచా గ్యారేజ్, షాజహాన్ ఫంక్షన్ హాల్, తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల వద్ద నిరంతర అన్నదానం


ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న మహ్మద్ బషీర్ తదితరులు

గోల్కొండ: నగరంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరుపేద రోగులు, వారి సహాయకులకు ప్రతినిత్యం భోజన ప్యాకెట్లు, నీటి బాటిళ్లు అందిస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సంఘ సేవకులు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రి, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి తదితర ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు భోజనం, నీటి బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 936 రోజులుగా ఎటువంటి విరామం లేకుండా ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మునుముందు కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. మిత్రులు, శ్రేయోభిలాషులు, దాతల సహకారంతో ఈ పుణ్యకార్యాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తోటి ఉద్యోగుల ప్రోత్సాహంతో మరిన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు భోజన సరఫరా చేస్తామని చెప్పారు. విద్యార్థుల్లో సైతం సేవా భావం పెంపొందించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు.

పైప్‌లైన్ పనులు పూర్తి ఎప్పుడో!


పురానాపూల్ జాతీయ రహదారిలో ఎంతకీ పూర్తికాని పైప్‌లైన్ పనులు

జియాగూడ: సంవత్సరాలుగా కొనసాగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనుల వల్ల జాతీయ రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటి కోసం పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. రహదారిపై ఒకవైపు నుంచి రాకపోకలకు అనుమతిస్తున్నారు. అయితే నిర్మాణ పనుల కారణంగా మూలమలుపులు ఉన్న పలుచోట్ల వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఎట్లా వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతున్నారు. ట్రాఫిక్ సమస్య కొంత మేరకు సమస్య పరిష్కారమైందనుకున్న కొద్దిరోజుల్లోనే పైప్‌లైన్ నిర్మాణం వల్ల మళ్లీ ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇప్పటికైనా అధికారులు వెంటనే పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలు సజావుగా సాగేవిధంగా చేయాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్ యూనియన్


మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్‌లను సత్కరించిన కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్‌కుమార్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆర్ఆర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి బుచ్చిరెడ్డిలతోపాటు యూనియన్‌కు చెందిన పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మట్లాడుతూ రౌండ్ ది క్లాక్ పద్ధతిలో రేయింబవళ్లు ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, ముఖీద్, ఖాదర్, రాజు, అహ్మద్, ముజాయిద్, ప్రియాసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం.. కళకళ

- పాతబస్తీలో సందర్శకుల సందడి
- విద్యార్థుల సెలవులు ముగియనుండటంతో పెరిగిన రద్దీ
- దారి దొరకని పరిస్థితి.. కనిపించని ఫుట్‌పాత్‌లు..
- ఎటుచూసినా చిరువ్యాపారాలే.. ముందుకు సాగని వాహనాలు


చార్ కమాన్-చార్మినార్ రోడ్డులో సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీలో పర్యాటకుల సందడి పెరిగింది. పర్యాటక ప్రాంతాలు కళకళలాడాయి. పాఠశాలలకు సోమవారం సెలవులు ముగుస్తుండటంతో ఎక్కడ చూసినా రద్దీనే కనిపించింది. దసరా సెలవుల అనంతరం మంగళవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనుండటంతో సోమవారం సందర్శకుల సందడి ఎక్కువైంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా అధికమయ్యాయి. ఎటువైపు నుంచి వెళితే తమ గమ్యస్థానాలకు చేరుకుంటామో తెలియక వాహనదారులు గందరగోళానికి గురయ్యారు. మూసీనది ఉత్తరం వైపున ఉన్న అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా చార్మినార్ వైపు ముందుకు రావడం.. మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లడం.. వాహనదారులకు నరకప్రాయమైంది. వాహనాల నడక నత్తను తలపించాయి. గుల్జార్‌హౌజ్ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్పలేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చార్మినార్ పరిసరాల్లో సందర్శకుల రద్దీ విపరీతంగా కనిపించింది. కాలినడకకు కూడా వీలులేని పరిస్థితులు ఎదురయ్యాయి. పర్యాటకులు కాలినడకన ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఇక్కడ తలెత్తాయి. కాలినడకే సాధ్యం కావడం లేదంటే.. ఇక వాహనాల రాకపోకల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అన్నీ నడిరోడ్డుపైనే..

ఇక వాహనాలకే కాదు.. నడకకు కూడా కనిపించని దారి.. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి... ఒక్కటేమిటి పాతబస్తీలో అన్నీ చిరువ్యాపారాలు రోడ్లపైనే దర్శనం ఇస్తాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే! పర్యాటక పరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక వీకెండ్ అయితే ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మదీనా-చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాతులే కాదు, రోడ్లు సైతం చిరు వ్యాపారులు ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక నిర్దిష్టమైన ప్రాంతాన్ని కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.


గంటల తరబడి నడిరోడ్డుపైనే వాహనాలు, సందర్శకులు

తైక్వాండోలో సత్తా చాటిన తపస్య



గన్‌ఫౌండ్రీ: ఉత్తరాఖండ్‌లో జరిగిన సీబీఎస్‌ఈ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన తపస్య మేక సత్తా చాటింది. అండర్-17 బాలికల విభాగంలో 14 పాయింట్లను సాధించి రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం ఆమెను పాఠశాల సిబ్బంది, కోచ్ ఠాకూర్ సురేందర్‌సింగ్‌లు సన్మానించారు. రాబోయే రోజుల్లో దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తెచ్చేలా రాణించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా టెంట్ల ఏర్పాటు..!

ఇది వరకు తొలగించినా మళ్లీ అదే తంతు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్లతో పాటు టెంట్లు వేశారని ఇటీవల కొంతమంది హైదరాబాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు మూడు వారాల క్రితం ఇక్కడ ప్రభుత్వ స్థలంలో షెడ్లను తొలగించారు. ఈ స్థలం ప్రస్తుతం రెవెన్యూ కస్టడీలో ఉందని అధికారులు ప్రకటించారు. అయితే వీటిని తొలగించి రెండు రోజులు గడవకముందే ఆక్రమణదారులు మళ్లీ యథా ప్రకారం అదే స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి రెవెన్యూ అధికారులకు సవాల్ విసిరారు. సుమారుగా రూ.500 కోట్ల విలువైన ఈ స్థలంలో కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రాగా స్పందించిన అధికారులు ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ టెంట్లు వేసుకోవడం చర్చనీయాంశమైంది. అధికారులు స్పందించి వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పురానాపూల్.. ట్రాఫిక్ ఫుల్

- గాంధీబొమ్మ చౌరస్తాలో నిత్యం స్తంభిస్తున్న వాహనాలు
- అక్రమంగా తోపుడుబండ్లు, ఆటోల తిష్ట
- పట్టించుకోని అధికారులు


పురానాపూల్ గాంధీబొమ్మ వద్ద నిలిచిన ట్రాఫిక్

జియాగూడ: పురానాపూల్ పరిసరాలు నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు అన్నీ ఇన్నీకావు. ఈ చౌరస్తా గుండా సుమారు ఐదు రహదారులు వెళ్తుంటాయి. పురానాపూల్ చౌరస్తా వద్ద కూరగాయల మార్కెట్, అక్రమంగా ఆటోల పార్కింగ్, తోపుడుబండ్లు తిష్ట వేసి ఉంటాయి. అయినా ఏ అధికారి కూడా పట్టించుకోరు. వాటిని తొలగించే నాథుడేలేడు. దీంతో వాహనదారులు ఎటువెళ్లాలో కూడా అర్థం కాని పరిస్థితి. పురానాపూల్ చౌరస్తా గుండా జాతీయ రహదారి, జియాగూడ మేకల మండి, కార్వాన్ రహదారి, అఫ్జల్‌గంజ్, పాతబస్తీ, చార్మినార్, మెహిదీపట్నం తదితర ప్రాంతాలకు పురానాపూల్ చౌరస్తా గుండానే వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడి నుండే ఆర్టీసీ బస్సులతో పాటు జియాగూడ మేకలమండికి భారీ లోడ్ లారీలు వెళ్తుంటాయి. పాతబస్తీ నుండి జాతీయ రహదారి గుండా హైటెక్ సిటీ, మెహిదీపట్నంకు పురానాపూల్ వంతెన గుండానే వెళ్లాలి. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ భారీస్థాయిలో స్తంభిస్తోంది. గంటలకొద్దీ ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచి పోతోంది. గాంధీబొమ్మ, పురానాపూల్ చౌరస్తాల వద్దే పండుగలకు సంబంధించిన సామగ్రి విక్రమాలు కొనసాగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. కొబ్బరికాయల దుకాణాలు, కూరగాయలు, తోపుడుబండ్లు ఈ చౌరస్తాను కబ్జా చేశాయి. దీంతో చౌరస్తా రహదారులు కుంచించుకుపోయి ట్రాఫిక్ సజావుగా ముందుకు వెళ్లడం లేదు. ఇప్పటికైనా స్థానిక పోలీసులు, ట్రాఫిక్ విభాగం, జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమలు కాని హామీలతో మోసం !


కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా పాటను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అత్తాపూర్: అమలు కాని నిర్ణయాలతో తెలంగాణ ప్రజలను ప్రలోభాలకు ఒకవైపు మభ్యపెడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు చీదరించుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖస్తుష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి శ్రీనగర్ కాలనీలోని కార్తీక్‌రెడ్డి నివాసంలో ఆయన పేరుపై రూపొందించిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలు ఆలోచనలకు పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారం ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండానే పేదలు, మధ్య తరగతి కుటుంబాలు నిర్మించుకున్న పక్కా నిర్మాణాలను హైడ్రా పేరుతో నెలమట్టం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జీవిస్తున్నామా.. అని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ మరింతగా చేరువయ్యేందుకు యువకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు నాగరాజు, రాముయాదవ్, రఘు అశోక్‌కుమార్, శ్రీపాల్, వెంకటేష్, శశికాంత్, దామోదర్, సంగీత్, రాజు తదితరులున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌తో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: పలు కాలనీల్లో దీర్ఘకాలిక సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే ఇంజినీరింగ్ అధికారులను కాలనీల వారీగా పంపి వచ్చే మున్సిపల్ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పందెన్ వాగుపై స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద వంతెన ఎత్తు పెంపు పనులను చేపట్టాలని ది సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్, సంయుక్త కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీలు తీసుకుంటూ.. సందడి చేస్తూ..

గోల్కొండ కోటలో పర్యాటకుల కిటకిట

గోల్కొండ: గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం వేలసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో జాతరను తలపించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం 7 గంటలకే కోటకు చేరుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్ కౌంటర్ ముందు భారీ క్యూ ఏర్పడింది. పిల్లలు, పెద్దలు కోటలోకి ప్రవేశించి ప్రహరీలు, ఫౌంటేన్, ఫిరంగుల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అక్కడ ఉన్న హిస్టరీ గైడ్స్ వారికి ప్రవేశ ద్వారం పైభాగాన ఉన్న క్లాపింగ్ పోర్టికో విశేషాలను వివరించారు. ఇక్కడ చప్పట్లు కొడితే కోటపై భాగంలో కొలువుదీరిన రాజుకు వినపడేదని వారు వివరించగా పర్యాటకులు ఆనాటి సాంకేతిక పరిజ్ఞానానికి ఆశ్చర్యచకితులయ్యారు. కుతుబ్‌షాహీ రాజుల కాలంనాటి ఆయుధాలు భద్రపరిచిన శిలాఖానా సందర్శనకు పోటీపడ్డారు. అక్కడ భద్రపరచబడిన సుమారు 500 సంవత్సరాల నాటి వివిధ రకాల ఆయుధాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. రాణిమహల్, అక్కడ ఉన్న ఫౌంటేన్ చూస్తూ పర్యాటకులు మెట్ల మార్గాన గోల్కొండ పైభాగానికి వెళ్లి అక్కడ కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. మార్గమధ్యలో శ్రీరాముడి పరమభక్తుడైన భక్త రామదాసును కుతుబ్ షాహీ రాజు బంధించిన చెరసాలను కూడా పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.


కోట బుక్కింగ్ కౌంటర్ వద్ద బారులు తీరిన పర్యాటకులు


గోల్కొండ కోటలో పర్యాటకులు

మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు


మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు అందిస్తున్న జంగ చైతన్య

గోల్కొండ: సేవా కార్యక్రమాలు చేసే వారిని సమాజం తప్పకుండా గుర్తిస్తుందని ఎఫ్‌టీపీసీ అధ్యక్షులు జంగ చైతన్య అన్నారు. గత 15 సంవత్సరాలుగా నిరుపేదల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించి అభినందించారు.కార్యక్రమంలో ప్రముఖ టాలీవుడ్ నటుడు సుమన్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు నేమ్‌సింగ్ ప్రేమి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి


డాక్టర్ పి.వి.శ్రీనివాసరావును సన్మానిస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: వైద్యుల సేవలు వెలకట్టలేనివని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. దశాబ్దానికి పైగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావుకు ఆయన ఉత్తమ సేవా అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్‌కు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యుల జీవితాలు రోగుల సేవకే అంకితమని అన్నారు. పేదలకు సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఏరియా ఆసుపత్రిలో సేవలు బాగా మెరుగు అయ్యాయని ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఎంతో చేయూతనిచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రమ్య, గోల్కొండ శ్రీ మహంకాళీ ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


ధోబీఘాట్ ఆర్‌యూబీ బ్రిడ్జి వద్ద చెట్ల కొమ్మలు అల్లుకొని ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

యాకుత్‌పురా: యాకుత్‌పురా ధోబీఘాట్ ఆర్‌యూబీ బ్రిడ్జి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్లకొమ్మలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. చెట్లకొమ్మల కారణంగా వీధిదీపం, విద్యుత్ తీగలు కనిపించకుండాపోయాయి. పక్కనే ఉన్న మరో స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కూడా చెట్లకొమ్మల మధ్య చిక్కుకుపోయింది. వీధి దీపం కనిపించకపోవడంతో రాత్రివేళల్లో ఈ ప్రాంతంలో అంధకారం అలుముకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంఎన్‌జే ఆసుపత్రిలో అన్నదానం


ఎంఎన్‌జే ఆసుపత్రిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సోమవారం దాదాపు 500 మంది రోగుల సహాయకులకు అల్పాహారాలు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేఆర్‌రాజ్ కుమార్, ఇతర నాయకులు కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శంకర్, ఉస్మాన్ అలీ, శివకుమార్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తున్నాం..


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణిలో ఆక్రమణల తొలగింపు, రోడ్లపై రెండు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

అయ్యప్పలకు నిత్యాన్నదానం

మణికొండ: గత కొన్నేళ్ల నుంచి అయ్యప్పలకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పుప్పాల్‌గూడ కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో సోమవారం ప్రారంభించారు. నవంబర్ 24వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని గురుస్వామి, అన్నదాన ప్రభువు కస్తూరి రాములు ముదిరాజ్ ప్రకటించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని అయ్యప్ప మాలాధారులు మధ్యాహ్నం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

